# తెలంగాణ ప్రభుత్వం మర్కజ్ ని తిట్టటం మాని కరోనా కట్టడికి అవసరమయిన చర్యలు చేపట్టాలి!

**05-05-2020**

కరోనా వైరస్ కి మతం, కులం, వర్గం, జెండర్ లేవని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. వ్యాధి సోకిన ప్రజలు, సోకి చని పోయిన వారి జాబితా చూస్తే కూడా ఇది స్పష్టమవుతుంది. అంతే కాదు, వ్యాధి సోకిన వారిలో ఎంత మంది చనిపోతారనేది ఆయా దేశంలో వుండే అసమానతలు, పేద వర్గాల, అణగారిన, జాతి ప్రజలకి ప్రజారోగ్య వ్యవస్థ ఎంత అందుబాటులో వుంది, అసలు ప్రజారోగ్య వ్యవస్థ ఎంత బలంగా పనిచేస్తోంది, దాని కెంత వనరులున్నాయి, ఆయా సమాజాల్లో వుండే అల్ప సంఖ్యాక వర్గాల ప్రజలని ప్రభుత్వం, వ్యవస్థ వివక్ష చూపకుండా చూసుకుంటోంది అనే విషయాలపై ఆధారపడుతుందని అమెరికా, జెర్మనీ ల మృతుల వివరాలు తెలుపుతున్నాయి. న్యూయార్క్ లో కొరోనా వైరస్ బారిన పడి చనిపోయిన వారిలో ఎక్కువగా ఆఫ్రికన్ అమెరికన్ ప్రజలు వున్నారు, వారిలో అనేకమందిని ఆస్పత్రుల నుండి తిప్పి పంపేశారు. ప్రజల్లో అవగాహన పెంచి, పెద్ద ఎత్తున కోవిద్ పరీక్షలు జరిపి, దానికనుగుణంగా అందరికీ సరయిన ఆరోగ్య వసతులు కల్పించి, వివక్ష లేకుండా చూసుకున్న జెర్మనీ లో అమెరికా వలే పెద్ద ఎత్తున మరణాలు సంభవించలేదు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ కేవలం లక్డౌన్ తో సరిపోదని, అనేక ఇతర చర్యలు తీసుకోవాలని చెపుతూ వస్తున్నా సరే, దురదృష్టవశాత్తు తెలంగాణ లో లాక్ డౌన్ అమలు పైన పెట్టిన ద్రుష్టి చెయ్యాల్సిన లాక్ డౌన్ సమయంలో చెయ్యాల్సిన ఇతర చర్యల పై పనులపై పెట్టలేదని గత నెలన్నర పరిణామాలు వివరిస్తున్నాయి. పెద్ద పెద్ద ఆస్పత్రులు కోవిడ్ ఆసుపత్రులుగా మార్చామని, 10,000 పడకలు ఉన్నాయని, 1000 వెంటిలేటర్లు రాబోతున్నాయన్న ప్రచార హోరులో, డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది ఆస్పత్రుల్లో, బయట పడుతున్న ఇబ్బందులు వెనక్కి పోయాయి. డాక్టర్లకి, నర్సులకి, ఇతర సిబ్బందికి సరయిన రక్షణ కవచాలు లేవనే విషయం బయటికి చెప్పిన నర్సుల పని పడతామని దాన్ని లేవనెత్తిన జర్నలిస్టులకి పరోక్షంగా వార్నింగ్ ఇవ్వటం ఇవ్వటం జరిగింది. ఇప్పటికీ కొనబోతున్న వెంటిలేటర్లు నడపగలిగే సిబ్బంది ఆస్పత్రుల్లో ఉన్నారా అన్నది మన ప్రభుత్వం చెప్పట్లేదు. ప్రజల్లో అవగాహన పెంచటానికి అవసరమయిన కార్యక్రమాలు అటుంచి, అనుమానితులకి కూడా అవగాహన పెంచట్లేదు. క్వారంటైన్ చెయ్యటానికి వివిధ కమ్యూనిటీలని సిద్ధ పరచటలేదు. ప్రాణాలకి తెగించి పని చేస్తున్న ఆశా వర్కర్ లకి తగినంత అవగాహన కల్పించలేదు. ఐసోలేషన్ అన్నా క్వారంటైన్ అన్నా భయపడి ప్రాణాలని కూడా తీసుకోవటానికి సిద్ధ పడుతున్నప్పటికీ, ఆక్టివిస్టులు సూచించిన హెల్ప్ లైన్ ఏర్పర్చలేదు. ఆస్పత్రులకు రాలేని డాక్టర్లు, వైద్య విద్యార్థులతో ప్రజలకి, క్వారంటైన్ లో, ఐసోలేషన్ వున్న వారికి కౌన్సెలింగ్ చెయ్యగలిగే ఫోన్ వాలంటీర్ల బృదాన్ని సిద్ధపరిచే అవకాశం ఉన్నప్పటికీ, అది వేరే రాష్ట్రాలు చేస్తున్నప్పటికీ, కేసులు తక్కువున్నాయి కాబట్టి మాకవసరం లేదని ఆరోగ్య శాఖా మంత్రి చెపుతున్నారు, నమ్ముతున్నారు.

**వివిధ రాష్ట్రాల కేసులు, కోవిద్ పరీక్షలు పోల్చి చూసినప్పుడు, పరీక్షలు తక్కువగా చేసిన రాష్ట్రాల్లో తెలంగాణా ఒకటి. ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ దాదాపు ఇరవై రోజుల క్రితం కోవిద్ పరీక్షలు విదేశాల నుండి వచ్చిన వారినీ, వారి బంధువులని మాత్రమే కాక (కాంట్రాక్ట్ ట్రేసింగ్) ఆస్పత్రుల్లో శ్వాస సంబంధిత వ్యాధులతో చేరిన రోగులకు చెయ్యాలని చెప్పింది. అలాగే ఇతర ప్రజారోగ్య నిపుణులు ముందు వరసలో పని చేస్తున్న డాక్టర్లు, నర్సులు, పోలీసులు, వైద్య అధికారులకు, కోవిడ్ లక్షణాలతో ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలకు, ప్రయివేటు ఆస్పత్రులకు వస్తున్న వారికి ఈ లాక్ డౌన్ సమయంలో కోవిడ్ పరీక్షలు జరపాలని, అలా జరిపితే తప్ప మన రాష్ట్రంలో అది కమ్యూనిటీ వ్యాప్తి దశకి చేరిందా/లేదా అన్న విషయం తెలియదని, అది తెలిస్తే కానీ లాక్ డౌన్ ఎప్పుడు ఎలా రిలాక్స్ చెయ్యాలో నిర్ణయించలేమని చెప్పినప్పటికీ మన ప్రభుత్వం అటువంటి చర్యలేమీ తీసుకోలేదు**. రెడ్ జోన్ అని ప్రకటించిన సూర్యాపేట లోనే ఏప్రిల్ రెండవ వారం నుండి పరీక్షలు చెయ్యలేదని వార్తలు వస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలని సన్నద్ధం చేసిన దాఖలాలు లేవు. దాని గురించి సమాచారమూ లేదు. ఎందుకు కోవిద్ పరీక్షలు చెయ్యట్లేదన్న ప్రశ్న ఎవరయినా వేస్తేనే ప్రభువుల వారికి ఆగ్రహం వస్తోంది!

ఎందువల్ల? ఇన్నాళ్లు ప్రభుత్వం తెలంగాణా లో కోవిద్ మర్కజ్ వల్లే అనే భ్రమలో ప్రజలని పెట్టింది. తెలంగాణ లోకి ఫిబ్రవరి నుండి అనేక వేల మంది అనేక దేశాల నుండి వచ్చారని, వారిలో కొంత మందికి వైరస్ సోకిందని, అందువల్ల కంటైన్మెంట్ జోన్లు, లాక్ డౌన్ ప్రకటించామని ఒక పక్క చెప్తూనే, కేవలం ఢిల్లీలో మర్కజ్ సమ్మేళనానికి వెళ్లిన తెలంగాణ ముస్లింల వల్లే రాష్ట్రము లో వైరస్ వ్యాప్తి చెందుతోందని, లేకుంటే తెలంగాణ వ్యాధి రహితంగా వుండి

ఉండేదనే విచిత్ర వాదన చేస్తూ వచ్చింది. ఈ వాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళటానికి తెలుగు టెలివిజన్ తమ వంతు బాధ్యతగా చాలా గట్టి ప్రయత్నమే చేసింది. పాత బస్తీలో పరీక్షల కోసం తీసుకెళ్తున్న వారిని చూపి పరీక్షలు జరపక ముందే వారికి వ్యాధి సోకినట్లు ప్రచారం చేసింది. పరీక్షల తరువాత వారికి వ్యాధి లేదని వచ్చిన ఫలితాలని పట్టించుకోలేదు. ఈ 'వాస్తవం' నమ్మటానికి అవసరమయిన ఆధారాలు - విదేశాల నుండి ఎందరిలో కాంట్రాక్టు ట్రేసింగ్, ఎన్ని పరీక్షలు చేస్తే ఎంత మందికి వైరస్ సోకింది, ఏ ఆధారంగా - అంటే వ్యాధి లక్షణాలు వున్నవారిలో, అసలు లేనివారిలో, ఎంత మందికి పరీక్షలు చేస్తే ఎంత మందికి వైరస్ వుంది, చని పోయిన వారిలో ఇప్పటికే ఇతర వ్యాధులు వున్న వారు ఎంత మంది - ఈ వివరాలు ప్రజలకి అందించలేదు. కేవలం మర్కజ్ సమ్మేళనాన్నుండి వచ్చిన వారికే, వ్యాధి లక్షణాలు వున్నా, లేకపోయినా (ఎసింప్టోమాటిక్ వ్యక్తులకి) పరీక్షలు చేసి, ఎన్నో దేశాలనుండి వచ్చిన వారిని గాలికి వదిలేసిందనే వాస్తవం బయటకి రాకుండా చేసింది. మర్కజ్ వల్లే తెలంగాణలో వ్యాధి వ్యాపించింది గుడ్డిగా నమ్మిన ముస్లిమేతర తెలంగాణా సమాజం ఈ వివరాలు అడక్కుండా తాము ముస్లిం సమాజం నుండి  దూరంగా ఉంటే వ్యాధి సోకదనే మూఢ నమ్మకంలోకి జారుకునేలా చేసింది!

**దీని వల్ల తెలంగాణా సమాజానికి జరిగిన నష్టం అపారమైంది. కరోనా వైరస్ తో పోటీ పడే మత విద్వేష వైరస్ తెలంగాణ సమాజంలో వ్యాప్తి చెందింది. మర్కజ్ రోగులు డాక్టర్లపై వుమ్మేశారని, బట్టలు విప్పుకుని తిరిగారని అబద్ధాలతో కూడిన ప్రచారం చేసి దానికి మొత్తం ముస్లిం సమాజాన్ని బాధ్యులని చేసి, ముస్లింలని తీవ్రంగా ఆక్షేపించటంతో ముస్లింల పట్ల ద్వేషం అందరిలో తీవ్రంగా ప్రబలి, వారిని వివక్షకు గురిచేయ్యటం సరైందే అనుకునే వాళ్ళు ఎక్కువయ్యారు. వివక్ష వల్ల కరోనా అంటే మరింత భయం పెరిగి రోగులు బయటకి రారు. అంతే కాదు, మర్కజ్ సమ్మేళన వ్యక్తులకి, వారి బంధువులయిన వారికి మాత్రమే పరీక్షలు ఎక్కువగా జరిపి, వారిపైనే ద్రుష్టి పెట్టి, వారినే క్వారంటైన్ చేయటం వల్ల కలిగిన పర్యవసానం ఏమిటంటే అధిక సంఖ్యాకులయిన ముస్లిమేతర ప్రజా సమూహం తమలో వైరస్ వ్యాపించదనే భ్రమలో బ్రతుకుతున్నారు. కొరోనా పరీక్షల గురించి, వైద్య సిబ్బంది గురించి, రక్షణ కవచాల గురించి, ఆరోగ్య అవగాహన గురించి వివరాలు తెలుపని ప్రభుత్వం  ఇటువంటి ద్వేషం, అజ్ఞానం, వివక్ష ప్రబలటంలో మాత్రం తనదయిన పాత్ర పోషించింది**. దీని పర్యవసానమే క్వారంటైన్, ఐసోలేషన్ చేస్తారనే భయంతో సమయానికి ఆస్పత్రికి వెళ్లకుండా, నిన్న అల్వాల్ లో నివసించే ఒక ముస్లిమేతర యువతి ప్రాణాలు పోగొట్టుకుంది.

తెలంగాణ సమాజం మర్కజ్ భ్రమల్లోంచి బయటికొచ్చి కరోనా గురించి ప్రభుత్వం చెప్తున్న విషయాలని విమర్శనాత్మకంగా చూసి ప్రభుత్వం నుండి అడగాల్సినవి అడగాలి.

- **ప్రభుత్వం కొరోనా ని మర్కజ్ కి ముడి పెట్టటం ఆపి, ద్వేషం వివక్షకి, అజ్ఞానానికి దారి తీసి, కొరోనా వైరస్ వ్యాప్తికి తోడ్పడుతోందని గుర్తించి, ముస్లింల పట్ల ద్వేష పూరిత ప్రచారాన్ని కట్టడి చెయ్యాలి.**

- **కొరోనా పరీక్షలు ఐసిఎమార్ సూచించినట్లు పద్ధతి ప్రకారం మరింత విస్తృతంగా చెయ్యాలి. కొరోనా లక్షణాలు వున్న వారికి పరీక్షలు సులువు చెయ్యాలి. ఈ సమాచారాన్ని ఇతర రాష్ట్రాల వలే అందరికీ అందేలా చెయ్యాలి.**

- **వైద్య సిబ్బందికి తగినన్ని రక్షణ కవచాలు అన్ని స్థాయిల్లో ఏర్పర్చి ప్రజారోగ్య వ్యవస్థని బల పరచాలి. ప్రజలకి క్వారంటైన్, ఐసోలేషన్ గురించిన భయాలు పోగొట్టాలి.**

- **రోగులకు, క్వారంటైన్లో వున్న వ్యక్తులకి అవసరమయ్యే ఆన్లైన్ సహాయ వాలంటీర్ వ్యవస్థని పౌర సమాజ సహకారంతో ఏర్పాటు చెయ్యాలి.**

అన్నీ తామే చేస్తున్నామన్న భ్రమని, అనవసర భేషజాలని పక్కన పెట్టి లాక్ డౌన్ సమయంలో వలస కార్మికులకు, అన్నార్తులకి రాత్రి పగలు చేయూత నందిస్తున్న తెలంగాణ పౌర సమాజ ప్రయత్నాల్ని ఇప్పటికయినా గుర్తించి ఆరోగ్య అవగాహన పెంచటంలో వారి సలహాలని స్వీకరించాలి. పౌరులందరినీ సమానంగా, వివక్ష లేకుండా చూడాలనే తన రాజ్యాంగ బాధ్యతలని మాటలలో కాకుండా, చేతలలో చూపించాలి.

TV links for reference
https://www.youtube.com/watch?v=LYJ94k0xnZA&feature=youtu.be
https://www.youtube.com/watch?v=jMPKO7ESfto&feature=youtu.be
https://www.youtube.com/watch?v=125d_5AWEOA&feature=youtu.be
https://www.youtube.com/watch?v=UEXGQLX9Z6c&feature=youtu.be
https://www.youtube.com/watch?v=wED3XQw-TsM&feature=youtu.be
https://www.youtube.com/watch?v=88kooBO84Oo&feature=youtu.be